# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

AUGUST - 2011

సంవత్సర చందా రూ. 50/-

# మీ కొక గొప్ప సదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురించబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును. గాని మీరు 85 /-రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

మా అడ్రస్:


Satya Vani

# 7-9-35, Sambamurty Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | ఆగస్టు - 2011 | సంచిక -1


## నాలుగు రకములైన ఆరాధన
## (Four Kinds of Worship )

దేవుని మనం ఆరాధించునప్పుడు ఆయన వాక్యము చొప్పుననే ఆరాధించ వలెనని తెలిసికొంటిమి. ఆరాధన చేయునప్పుడు మన ఆరాధనమూర్తి నిజదేవుడై యుండవలెనని, మన మనస్తత్వము సరియైనదై యుండవలెనని కూడ ఇది వరకు మనం తెలిసికొని యున్నాము. అట్లు కానియెడల మనము దేవునికి చేయు ఆరాధనయంతయును ప్రయోజన శూన్యమగును. దేవుని ఆరాధన చేయుటలో నిమగ్నులైన మానవులు ఈనాడు ప్రపంచమందు ఉన్నారు. అయితే వారందరి ఆరాధన దేవునికి ఇష్టపూర్వకమైనది కాదు అని దైవగ్రంధము వలన మనము గ్రహించుకొన వచ్చును. ఈనాడు మానవులు దేవునికి చేయు ఆరాధన కనీసము 4 రకములుగానున్నది. క్రొత్త నిబంధన గ్రంథమునుబట్టి మనం ఒక్కొక్క దానిని పరిశీలించుదము.

**మొదటిది వ్యర్థారాధన :**

నేడు క్రైస్తవులమని చెప్పుకొనుచు దేవుని ఆరాధించువారిలో ఎక్కువమంది

చేయు ఆరాధన వ్యర్థమైనది. మత్తయి వ్రాసిన సువార్త 15వ అధ్యాయము, 7వ వచనమునుండి 9వ వచనము వరకు చదివినయెడల, యేసు ఇట్లనుచున్నారు; "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘన పరుచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు".

ఒకనాడు యెరూషలేమునుండి శాస్త్రులును, పరిసయ్యులును యేసునొద్దకు వచ్చి నీ శిష్యులు చేతులు కడుగుకొనకుండ భోజనము చేయుచున్నారే, వారెందు నిమిత్తము పెద్దల పారంపర్యాచారమును నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు............ మనుష్యులు కల్పించిన పద్ధతులు దేవుని ఉపదేశములే యని బోధించుచు మీరు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని యేసు వారిని హెచ్చరించెను.

నేటి క్రైస్తవ లోకము నిజానికి ఆనాటి యూదులకు ఏమియు తీసిపోలేదు. యేసుక్రీస్తు కాలమునాటి యూదుల వలె నేడు క్రైస్తవ ఆరాధనలోనికి, ఆచరణలోనికి అనేకమైన పారంపర్యాచారములు తీసికి నివచ్చుట జరిగినది. భోజనము చేయు టకు ముందు చేతులు కడుగుకొనుట మంచిదే. అయితే చేతులు కడుగు కొనుటయే ఒక ఆరాధన క్రియగా చేయుట దోషము అగును. మనుష్యులు కల్పించిన సిద్ధాంతములు, బోధలు, ఆచారములు నేడు క్రైస్తవ లోకమునందెన్నియో ఉన్నవి, వాటన్నిటిని బట్టి మనము చేయు ఆరాధన నిజానికి ప్రయోజన శూన్యమైనది, పనికిరా నిది, వ్యర్థమైనదియని మనము గ్రహించ వలెను. పెద్దల పారంపర్యాచారమును బట్టి మనము దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నాము అని యేసు చెప్పుచున్నారు (మత్త 15:7-9).

గనుక మిత్రులారా, మీ ఆరాధన క్రమమును, మీ ఆరాధన క్రియలను ఒకసారి దేవుని వాక్యముతో సరిపోల్చి చూడుడి. వాక్య ప్రకారము లేకుండా, తరతరాల నుండి చేయుచున్న క్రియలు అందులో మీకు ఎన్నో కన్పడగలవు. అట్టివి లేనియెడల చాలసంతోషమేగాని, అట్టివి ఉన్నయెడల వాటిని తొలగించి దేవుని వాక్యప్రకారము మీ ఆరాధన జరుగునట్లు చూడుడి. ఒకవేళ వాక్యము చెప్పుచున్న క్రియలను కొన్నిటిని జరిగించు టలేదేమో. వాటిని తప్పక మీరు చేయులా గున జాగ్రత్తపడండి.

రెండవదిగా, మనము **తెలియని ఆరాధనను** కనుగొనగలము. అపొస్తలు డైనపౌలు ఒకసారి ఏథెన్సు అను పట్టణ మునకు వెళ్ళెను. ఆ పట్టణము విగ్రహము లతో నిండియుండుట చూచినందున అతని

ఆత్మ పరితాపము పట్టలేక పోయెను. అపొ.కా. 17:22,23 వచనములలో మన మీ విధముగ చదువగలము: "పౌలు అరెయొపగు మధ్యను నిలిచి చెప్పినదే మనగా – ఏథెన్సువారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతా భక్తి కలవారై యున్నట్లు నాకు కనబడుచున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తిని కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురించుచున్నాను."

ఏథెన్సు పట్టణస్తులు భక్తిని కలిగియున్నారు. గాని వారు నిజదేవుని నెరుగనందున వారు "తెలియని ఆరాధ నను" జరుపుచున్నారు. అట్టివారి మూడ భక్తిని దేవుడు గౌరవించడు. మూఢ నమ్మకము చొప్పున చేయు ఆరాధన దేవునికి ఇష్టము కాదు. "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించువాని ప్రార్ధన హేయము" అని సామెతలు 28:9లో వ్రాయబడి యున్నది. అందు వలననే దేవుని యదార్థముగా ఆరాధిం చువారు, "ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" అని ఆయన కోరుచు న్నారు. ఏథెన్సువారివలె మనము చేయు తెలియని ఆరాధనను ఇకమీదట దేవుడు సహించడు. ఆయన ఇట్లు చెప్పుచున్నారు: "ఆ అజ్ఞాన కాలమును దేవుడు చూచి నట్టుగానుండెను; ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17: 30).

**మూవడది స్వేచ్ఛారాధన** : ఇది కొలస్సయులకు వ్రాసిన పత్రిక 2:20–23 వరకు ఉన్న వచనములలో వివరింపబడి యున్నది. "మీరు క్రీస్తుతో కూడ లోకము యొక్క మూల పాఠముల విషయమై మృతి పొందినవారైతే, లోకములో బ్రతుకుచున్న ట్లుగా మనుష్యుల ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి చేతపట్టుకొనవద్దు, రుచిచూడ వద్దు, ముట్టవద్దు అను విధులకు మీరు లోబడనేల? అవన్నియు వాడుకొనుట చేత నశించిపోవును. అట్టివి స్వేచ్ఛారాధన విషయములోను, వినయ విషయము లోను, దేహ శిక్ష విషయములోను, జ్ఞానరూపక మైనవని యెంచబడున్నవేగాని, శరీరేచ్ఛా నిగ్రహ విషయములో ఏ మాత్రమును ఎన్నిక చేయతగినవి కావు."

స్వేచ్ఛరాధన యనునది మాన వేచ్ఛలబట్టి ఆరంభమైన క్రియలను సూచిం చుచున్నది. ఆ పదము భక్తిని సూచింప వచ్చునేమోగాని, ఆ భక్తి లేఖనములను అనుసరించి లేనప్పుడు అది ఖచ్చితముగా దేవునికి అంగీకారయోగ్యము కానిదగును.

ఆఖరిగా మనము క్రొత్తనిబంధన

లో సత్యారాధనను గూర్చి చూడగలము, యోహాను 4:24లో యేసుక్రీస్తు ఇట్లనుచున్నారు : "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను". ఆత్మతో ఆరాధింపంవలెనన్నపుడు మనము ఆత్మజ్ఞానము గలవారమై నిష్కపటముగ ఆరాధింపవలెను. సత్యముతో ఆరాధించుటకు మనము సత్యవాక్యమేమి చెప్పుచున్నదో దానినిబట్టి చేయవలెను. ఒకవేళ మనము వాక్యప్రకారమే ఆరాధనను జరిగించుచున్నను, దానిని కోపబుద్ధితోను, వేషధారణతోను, గర్వముతోను జరిగించిన, అట్టి ఆరాధన దేవునిచే తిరస్కరింపబడును. ఒకవేళ మనము ఆత్మజ్ఞానము కలిగి, లేఖనముల ప్రకారము ఆరాధనను జరిగించకుండిన యెడల అట్టి ఆరాధన కూడా తిరస్కరించబడును. "సత్యమునందు వారిని ప్రతిష్ఠచేయుము, నీ వాక్యమే సత్యము అని యోహాను 17:17లో యేసు చెప్పెను. గనుక మనము దేవుని నారాధించునప్పుడు నిర్మలమైన బుద్ధిని, ఆత్మజ్ఞానమును కలిగిన వారమై యుండవలెను; సరిగదా మన ఆరాధనను సత్యవాక్య ప్రకారము జరిగించవలెను. దానికి తక్కువగా గాని, ఎక్కువగా గాని చేయకూడదు.

క్రొత్త నిబంధనను చదువునప్పుడు ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో కనీసము అయిదు సంగతులను జరిగించినట్లు మనము కనుగొనగలము. ఈనాడు మనము చేయు ఆరాధన, ఆదిమ క్రైస్తవులు చేసిన ఆరాధనతో సరిపోవుచున్నదో లేదో కూడ మనం పరిశీలించుట మంచిది.

1. ఆదిమ క్రైస్తవులు దేవుని వాక్యమును ధ్యానించుటకు కూడుకొనిరి. అపొ.కా. 20:7లో పౌలు ఒక కూటములో ప్రసంగించుట మనము చూడగలము.

2.వారు ఆరాధనలో ప్రార్థన చేయుటకు కూడుకొనిరి. ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందు, సహవాసమందు, రొట్టె విరుచుట యందు ప్రార్థన చేయుట యందు ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42).

3. వారు దేవునికి సుత్తిగానములు చేయుటకు కూడుకొనిరి. ఆరాధనలో వారు కీర్తనలు, ఆత్మ సంబంధమైన పాటలు మాత్రమే పాడిరి. గాని వాయిద్యములను వినియోగించ లేదు. దయచేసి మీరు కొలస్స 3 :16, ఎఫెసీ 5:19 ని చదువండి.

4. ఆదిమ క్రైస్తవులు ప్రతి ఆదివారమును ప్రభురాత్రి భోజనమునందు పాలు పొందుటకు కూడుకొనిరి (అపొ.కా. 20:7).

5. తరువాత వారు వర్ధిల్లిన కొలది దేవునికి కానుకల నిచ్చుటకు కూడుకొనిరి (1 కొరింధి 16:1-2). లేఖనములు బయలుపరచు సత్య ఆరాధన యిది. మీరు చేయు ఆరాధన ఇట్లు లేనియెడల ఎక్కడో కొంత దోషము ఉన్నదని మీరు ఇట్టే గమనించగలరు. వాక్యమును బట్టి దానిని సరిదిద్దుకొందురని నా నిరీక్షణ. దేవుని మనము ఆయన సంఘము ద్వారా ఆరాధించవలెను. "నమ్మి బాప్తిస్మము పొందిన" ప్రతివానిని ప్రభువు తన సంఘమందు చేర్చును. మీరు ఈనాడే ఆయన సువార్తకు లోబడి, ఆయనను ఆయన సంఘముద్వారా మహిమ పరచుటకు సిద్ధడవలెనని నాకోరికయైయున్నది! (మార్కు 16:16; ఎఫెసీ 3: 21).

క్రైస్తవరుజువులు :

## అంతరంగిక ఋజువు
## (Internal Evidence )

పరీక్షింపదగిన విషయాల్లో బైబిలు నమ్మదగినదని కనుగొనిన తరువాత పరీక్షింపదగని విషయాల్లో కూడ అది నమ్మదగినదే యనుటకు మంచికారణము లున్నాయి. ఈ పాఠంలో బైబిలు అద్వితీయ గ్రంధమని, దానికి సాటియైనది వేరొకటి లేదని చూపించే అంతరింగిక ఋజువును గమనించుదాం.

**అద్వితీయ సిద్ధపాటు(Unique Preparation) :**

బైబిలు నిజానికి 66 పుస్తకములు సంపుటియై యున్నది. దానిని 40 మంది లేఖకులు మూడు భాషలలో మూడు ఖండములలో 1600 సంవత్సరముల కాలములో లిఖించిరి. అయినను ఆ 66 పుస్తకములను కలిపితే అవి ఒకే గ్రంధమై ఆదినుండి అంతము వరకు ఒకే అంశమును గూర్చి చెప్పుచున్నది.

ఈ నలువది మంది లేఖకులు వందలాది అంశములను గూర్చి వ్రాసిరి, అయినను దేవుని గూర్చి, మానవుని గూర్చి, దుష్టత్వము, నీతి అవినీతియను వాటిని గూర్చి ఏక కంఠముతో వ్రాసిరి.

**ఏకైక గ్రంధకర్త (Unique Authroship):**

బైబిలు లేఖకులు వివిధ విద్యా స్థాయిల నుండి, సంస్కృతుల నుండి వచ్చిన వారు. వారు జ్ఞానములోను, వ్యక్తిగత తత్వములలోను వేర్వేరుగా యున్నవారు. మోషే రాజభవనములో పెరిగెను. ఐగుప్త

దేశపు శ్రేష్ఠమైన విద్యనభ్యసించెను. యెహోషువ, ఒక సేనాధిపతి, సమూయేలు ఒక ప్రవక్త, మరియు ప్రవక్తలకు ఉపదేశకుడు. దావీదు గొర్రెలకాపరి, కవి, గాయకుడు, రాజు. సొలొమోను వేదాంతి, రాజు ప్రఖ్యాతిగాంచిన జ్ఞాని. యెషయా దేవుని ప్రవక్త మరియు ముగ్గురు రాజులకు సలహాదారు. దానియేలు బబులోనులోను, పర్షియాలోను, వుండిన ఉన్నత ప్రభుత్వాధిపతి. ఆమోసు గొల్లవాడు, ఎజ్రా యాజకుడు, శాస్త్రి: నెహెమ్యా యూదా పాలకుడైన అహష్వే రోషు యొక్క పానదాయకుడు. పేతురు యోహానులు పల్లెవారు. మత్తయి ఒక సుంకరి, పన్ను వసూలు చేసేవాడు, లూకా వైద్యుడు. పౌలు డేరాలు కుట్టుకొనేవాడు, మరియు పరిసయ్యుడు బోధకుడు. ఇతంకంటె భిన్న తత్వములు గలవారిని కనుగొనుట దుర్లభము. అయినను వారు లిఖించిన దానియంతటితోను వారందరు ఏకీభవించిరి.

**వివిధ స్థలాల్లో వివిధ భాషలలో వ్రాయబడెను :**

బైబిలు మూడు భాషలలో వ్రాయబడెను: హెబ్రీ గ్రీకు మరియు అరామిక్. హెబ్రీ ఇశ్రాయేలీయుల భాష,అలెగ్జాండరు చక్రవర్తికి ముందు అరేబియా ప్రాంతములో అరామిక్ భాషను వాడిరి. క్రీస్తు కాలములో గ్రీకు అంతర్జాతీయ భాషయైయుండెను.

బైబిలు నందలి పుస్తకములు 13 దేశాలలో మూడు ఖండములలో వ్రాయబడెను. మోషే మోయాబు మైదానములో సీనాయి అరణ్యములో వ్రాసెను. యిర్మియా యెరూషలేములోను, ఐగుప్తులోను రాజభవనములోను వ్రాసెను. యెహెజ్కేలు బబులోను (ఇరాన్)లో వ్రాసెను. దానియేలు బబులోను (ఇరాక్) లోను పర్షియా (ఇరాన్) లోను వాసెను. పౌలు రోమా చెరసాలలోను,యోహాను ఎఫెసు (టర్కీ) దగ్గర పద్మాసుద్వీపములోను వ్రాసిరి. అయినను వారి వ్రాతలన్నియు పజిలులోని భాగముల వలె ఒకదానితో నొకటి చక్కటి పొందిక గలిగియున్నవి.

**వివిధ రకములైన సాహిత్యము :**

F.F. Bruce, అనునతడిట్లు చెప్పాడు : "బైబిలు లేఖనములు వివిధ రకములైన గొప్ప సాహిత్యమునకు చెందును. అవి: చరిత్ర, శాసనము క్రిమినల్ మరియు సివిల్ శాసనము, నైతిక, పారంపర్యక, పారిశుద్ధ శాసనము), ఆధ్యాత్మిక కావ్యము, పద్యకావ్యము, ఉపమానము, జీవిత చరిత్ర వ్యక్తిగత ఉత్తరాలు, స్మృతులు మరియు డైరీ మొ॥నవి. దీని యంతంటి లోను

గొప్ప ఐక్యత కనబడుచు ఒక దానితోనొకటి కలుపుచున్నది.

నేడు మనము జ్ఞానము గల 40 మంది ఇండిపెండెంట్ మనుష్యులను వివిధ జాతుల నుండి, వృత్తుల నుండి, విద్యాభ్యాసమును కలిగియున్న వారిని 3 ఖండములు 13 దేశముల నుండి ఎంచుకొని వారిని నైతిక జీవనము, స్వలింగ సంపర్కము చేయువారి హక్కులు, ఆత్మ హత్య, భ్రూణహత్య, మానవ క్లోనింగ్ మరియు అద్దెకు తెచ్చుకున్న తల్లులు మొదలగు అంశములపై ఒక గ్రంధమును వ్రాయమంటే ...? ప్రతి అంశము మీద ఈ నలువది మంది ఏకీభవిస్తారనడానికి అవకాశమున్నదా? నిజానికి యేమీ లేదు.

వాస్తవానికి మనం ఒకే దేశములో, ఒకే కాలములో, ఒకే జీవన స్థాయి కలిగిన ఇద్దరిని ఎంచుకొంటే నేడు సమాజమును చిన్నాభిన్నములు చేయు చున్న నైతిక సమస్యలపై వారి ఆలోచన లను వెలికితీస్తే, వారిద్దరు ఏకీభవించుట అసంభవము. అయినను బైబిలు లేఖకులు ఏక కంఠముతో వ్రాసారు. దీనినెట్లు వివరించగలము?

**దేవునిచే ప్రేరేపించబడిరి :**

దీనికి న్యాయ సమ్మతమైన ముగింపు యేమంటే ఆ నలువది మంది లేఖకులు దేవుని ఆత్మచే ప్రేరేపించబడిరి. ఈ 66 పుస్తకములను లిఖింపచేసిన గొప్ప ఆత్మ ఒకడున్నాడు. దేవుడే బైబిలు యొక్క అసలైన గ్రంధకర్త.

అపొస్తలుడైన పేతురు ఇట్లు వ్రాసాడు : "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలము గా పలికిరి" (2 పేతురు 1:20-21).

తమ మనస్సులో ఉద్భవించిన తలంపులను గాక, దేవుని మనస్సులోని మాటలను ఆయా లేఖకులు వ్రాసిరని పేతురు చెప్పుచున్నాడు. ప్రవక్తలు తాము వ్రాసిన లేఖనములను శ్రద్ధగా పరిశీలించుచు దేవుని ఆత్మ వారిచే యేమి వ్రాయించెనో దానిని విచారించి పరిశోధించిరి యని పేతురు వివరిం చెను (1 పేతురు 1:10-11).

అపొ.పౌలు పేతురుతో ఏకీభవించెను. లేఖనములన్నియు దైవావేశములని అతడు చెప్పాడు (2 తిమో 3:16-17). లేఖకులు తమ పదజాలమును, వ్రాసే పద్ధతిని వినియోగించినను, వారు వ్రాసిన మాటలు వారి సొంతము కాదు. దేవునివి. పరిశుద్ధాత్మావేశ అద్భుతశక్తిని బట్టి దేవుడు వారి మాటలను నడిపించాడు. పొరబాట్లు నుండి భద్రపరిచాడు, మానవ జాతికి ఆయన పరిపూర్ణ వాక్యము నందించుటకు వారి సహజ వరమునకు తన ఆత్మీయ వరమునను గ్రహించాడు.

**ఆత్మావేశపు ఆరోపణలు :**

పాత నిబంధన యొక్క లేఖకులు

అనేకమంది వారి వర్తమానము దేవుని నుండి కలిగినదేయని చెప్పారు. "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు", దేవుడు చెప్పెను; "ప్రభువగు యెహోవా వాక్కు" "ప్రభువు ఈలాగు సెలవిచ్చెను", దేవుడిట్లు ఆజ్ఞాపించెను" మొ॥గు మాటలు బైబిలులో రెండువేలకు పైగా కనబడును.

మోషే, దావీదు, యెషయా, యిర్మీయా, హోషేయ, ఆమోసు, ఓబద్యా, యోనా, హబక్కూకు, జెఫన్యా మరియు జెకర్యాలు అందరు దేవుడు తమ ద్వారా మాట్లాడుచున్నాడనియు, వారి మాటలు దేవుని మాటలే అనియు చెప్పారు (2 సమూ 23:2; యెషయా 1:2; యిర్మీయా 10:2; యెహెజ్కేలు 1:3; ఆమోసు 1:3; 6,9,11,13,2:1, ఓబద్యా1,యోనా 1:1; మీకా 1:1; హబక్కుకు 2:2; జెఫన్యా 1:1; జెకర్యా 1:1).

క్రొత్త నిబంధన లేఖకులు కూడ వారి వర్తమానము దేవునిదే యని చెప్పారు, ఉదాహరణకు అపో. పౌలు కొరింథులోని సంఘమున కిట్లు చెప్పాడు: "నేను వ్రాయుచున్నవి ప్రభువు యొక్క ఆజ్ఞలని దృఢముగా తెలిసికొనవలెను" (1కొరింథీ 14:37). "మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా" యని అతడు థెస్సలోనికయలోని సంఘమునకు వ్రాసెను. "ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" అని తిమోతికి అతడు వ్రాసాడు (1తిమోతి 4:1).

**ప్రవక్త యొక్క పరీక్ష :**

బైబిలు లేఖకులు దేవుని మాటలనే పలుకుచున్నామని చెప్పినంత మాత్రముననే సరిపోదు, అబద్ధ ప్రవక్తలు కూడ అట్లే చెప్పుకొన్నారు, చెప్పుకొంటారు .

మోషే యిట్లు చెప్పాడు: "మరియు ఏదొక మాట యెహోవా చెప్పినది కాదని మేమెట్లు తెలిసికొన గలమని మీరనుకొనిన యెడల ప్రవక్త యెహోవా నామమున చెప్పినప్పుడు ఆమాట జరుగక పోయిన యెడలను ఎన్నడు నెరవేరక పోయిన యెడలను అది యెహోవా చెప్పిన మాటకాదు, ఆ ప్రవక్త అహంకారము చేతనే దాని చెప్పెను గనుక దానికి భయపడవద్దు" (ద్వితీయో 18:21-22).

ప్రవక్త యొక్క మాట అన్ని వేళలందు అక్షరాల నూటకి నూరుపాళ్లు నెరవేరిన యెడల అతడు నిజమైన దేవుని ప్రవక్తయని గుర్తించబడెను. పూర్వము నూటికి నూరుపాళ్ల పరీక్ష వలన ప్రజలు ప్రవక్త యొక్క మాటను దాని నెరవేర్పును గమనించగలిగే వారు. అయితే మన సంగతి యేమిటి? బైబిలు లేఖకులు

దేవుని నిజప్రవక్తలని మన మెట్లు నిర్ధారించగలము? మనం దానిని గూర్చియున్న బాహ్య ఋజువులు, అంతరంగిక రుజువులపై ఆధారపడ వలెను. ఆ ఋజువులనే ఈ గ్రంథములో మనం పరీక్షించుచున్నాము. వ్రాత ప్రతులు, పురావస్తు శాస్త్రము, విజ్ఞాన శాస్త్రము, ప్రవచనముల నెర వేర్పుల ద్వారా ఋజువులు పేరుకు పోవుచున్నందున బైబిలు అద్వితీయమని, నమ్మదగినదని, దానిపై మనం ఆధారపడ దగ్గదనీ, అది దేవునివాక్యమని మనం నమ్మవచ్చుననుట ఆమోదయోగ్యమే. దాని అంతరంగిక రుజువులను గమనింతము.

**లేఖకుల నిష్కాపట్యము :**

బైబిలు వ్యక్తులు గూర్చి చెప్పునప్పుడు దాని లేఖకులు నీతి, యదార్ధతలు గలవారు. ఆయా వ్యక్తుల దోషములను కప్పిపుచ్చుటకుగాని, వారిని ఆదర్శవంతులుగా చిత్రీకరించుటకుగాని బైబిలు లేఖకులు ఎవ్విధమైన ప్రయత్నము చేయలేదు. వారు సింపుల్‌గా సత్యాన్ని చెప్పారు. మేలుకైనా, కీడుకైనా వారు సత్యాన్నే చెప్పారు. ఆధునిక జీవిత చరిత్రకారులు అంతటి నిష్కపటులు కాదు.

నోవహు నీతిపరుడు గనుక దేవుని కృపపొందిన వాడాయెను. మానవ జాతిని భద్రపరుచు నిమిత్తము దేవుడతనిని ఎంచుకొన్నారు. అతన్ని గూర్చి మోషే వ్రాయునప్పుడు నోవహును ఒక హీరోగా చిత్రించి, అతని పొరబాట్లను మరిచిపోతాడును కొంటాము. అట్లుగాక నోవహు త్రాగినమత్తులో, సిగ్గువదలి దిగంబరుడుగా అతని గుడారములో నిద్రించుట మనం చూస్తాము. త్రాగడం ఆమోద యోగ్యమేయని బైబిలు చెప్పుట లేదు. గాని నోవహు చేసిన పొరబాటును అది సూక్ష్మంగా మనకు తెలియజేయుచున్నది.

విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము గొప్ప బైబిలు నాయుకుడు అయినను, రెండు సందర్భాల్లో అతడు తన భార్యను గూర్చి అబద్ధమాడాడు. ఆమె తన సహోదరియని చెప్పాడు. అబద్ధాలు చెప్పడాన్ని బైబిలు సమర్థించుట లేదు, గాని ఒత్తిడిలో అబ్రాహాము యొక్క బలహీనతను మనకు బైబిలు తెలియజేయుచున్నది.

మోషేను గూర్చి ఆలోచించు. ఆధునిక జీవిత చరిత్రకారులు మోషేను మచ్చుకు కూడ పొరబాటు చేయని నాయకునిగా, శాసన కారుడుగా చిత్రీకరిస్తారు. గాని మోషే రెండు మార్లు తన సహనమును కోల్పోయెనని, దేవుని కోపముకు గురి అయ్యాడని, తత్ఫలితముగా వాగ్దాన దేశము చేరుకొనలేకపోయాడని బైబిలు అతని గూర్చి చెప్పుచున్నది.

'దేవునికి ఇష్టపూర్వకమైన దావీదును' గూర్చి చూడుము. అతడు ఇశ్రాయేలు చరిత్ర

అంతటిలో గొప్పరాజు. అతని సిగ్గుకరమైన వ్యభిచారమును గూర్చి నరహత్యను గూర్చి ఆధునిక లేఖకుడెవరు వ్రాయడు. గాని బైబిలు లేఖకుడా సంగతులను సూక్ష్మంగా సత్యమని వ్రాసాడు. వ్యభిచారమును, నరహత్యను బైబిలు సమర్ధించదు, గాని దావీదు యొక్క పాపములను గూర్చి అది యదార్థత కలిగియున్నది.

ప్రవక్తలలో ఘనుడైన ఏలియా కూడ ఒక బదరీవృక్షము క్రింద కూర్చొని, ఆవేదనతో సణుగుకొనుచు, చనిపోవాలనే కాంక్షను వ్యక్తపరిచాడు.

ఇదే రకమైన నిష్కాపట్యము క్రొత్త నిబంధనలో కూడ ప్రదర్శింపబడినది. మత్తయి మార్కులు తమ్మును గూర్చియేమీ ఆడంబరముగా చిత్రీకరించుకో లేదు. యేసు బంధింపబడినప్పుడాయన శిష్యులందరు ఆయనను విడిచి పారిపోయిరి. పేతురు సయితము ప్రభువు నెరుగనని ఒక రాత్రి ముమ్మారు బొంకాడు. హాని కలిగించే అట్టి రిపోర్టు లను అంత గొప్ప వ్యక్తి జీవిత చరిత్రలో మనం చేర్చు దుమా?

**నైతిక సూత్రములు :**

బైబిలు నందలి నైతిక సూత్రములు ఉత్కృష్టములు. అనైతిక చర్యలను ఎక్కడా బైబిలు సమర్ధించదు. బైబిలు అవినీతి, అక్రమము అనైతిక దుష్ట చర్యలను గూర్చి చెబుతాది గాని వాటిని ఎన్నడు ఆమోదించదు. లేఖనములు మనలను ఎల్లవేళలా ఉన్నత నీతి సూత్రముల వైపు నడిపించును. రక్షణ సంకల్పము కూడ మనలను పాపము నుండి విడుదల చేయడానికే సంకల్పించబడినది.

**ముగింపు :**

ఈ గ్రంథములో మనము సేకరించిన రుజువులన్నిటితో అంతరంగిక ఋజువులను కూడ చేర్చితే, బైబిలు అద్వితీయమని, దేవుని నుండి కలిగినదని నమ్ముటకు సరిపడినన్ని కారణములు మనకున్నాయి. అది నమ్మదగిన దేవుని వాక్యము.

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

## పెద్దలు - వారి ఏర్పాటు ప్రతిష్ఠత
## (Elders, Their Appointment and Ordination)

**స్థానిక సంఘాభివృద్ధి :**

కొంతమంది సహోదరులను పెద్దలుగా ఉండుటకు ఎంపిక చేసికొనిన తరువాత వారు ప్రతిష్టింపబడక ముందు సంఘమునకు వారు తమ కృతజ్ఞతను, అభినందనను తెలియజేస్తు తమకప్పగింపబడిన పనిని కృతనిశ్చయముతో కొనసాగింతుమని తెలియజేయుట మంచిది. వారిని పెద్దలుగా ఎంపిక చేయుటకు ఏర్పాటు చేయబడిన కమిటీ వారు పెద్దలుగా ఎంపిక చేయబడినవారికి కూడ తమ అభినందన తెలియజేయుట మంచిది.

దిగువ యిచ్చుచున్న సలహాలు కేవలము కామన్ సెన్స్ సలహాలు మాత్రమే. అనుకరించడానికి మనకు ముందు జరిగిన సంఘటన యేదీలేదు. అయితే ప్రజలు తమ లోక జ్ఞానమును (Common Sense) వినియోగించాలని కూడ దేవుడు కోరును. పెద్దలను ఏర్పాటు చేయుట చాల ప్రాముఖ్యమైన పనిగనుక మొదటినుండి ఈ విషయంలో సంఘము ఏక మనస్సు కలిగియుండుట ముఖ్యము. గనుక పెద్దగా ఏర్పరచబడిన వారిని పిలిపించి కమిటీ వారు, స్థానిక సంఘము వారికి దిగువరీతిగా బాధ్యతల నప్పగించాలి.

**క్రొత్తగా ఏర్పరచబడిన పెద్దలకు బాధ్యతలనప్పగించుట :**

“సహోదరులారా స్థానిక సంఘము మిమ్ములను పెద్దలుగా యుండుటకు ఎంచుకొన్నారు. యిది మీకు లభించిన అత్యంత గౌరవము. అది గౌరవమే కాదు దానితో గొప్ప బాధ్యతలు కూడ మీకు అప్పగింపబడుచున్నాయి. వాటిని తీవ్రముగా మీరు పరిగ్రహించాలి. అన్ని వేళలా మీరు మీ గురుతర బాధ్యతలు నిర్వర్తించడానికి, చురుకుగా యుండాలి. సంఘమంతా మిమ్మును పెద్దలుగా ఎంపికచేసి జ్ఞాన యుక్తమని పనిచేసారని వారికి నమ్మకం కలిగించాలి. గనుక మీరు సంఘమునకు మీ కృతనిశ్చయతను, హామీని తెలియజేస్తే మంచిది, అట్లు చేయడంలో, దిగువ సలహాలను పాటించుట మంచిది.

**మీ వ్యక్తిగత కృతజ్ఞత తెలుపుడి :** మీతోటి సోదరులు మీ యందు గొప్పనమ్మిక యుంచినందున, మీరు వారికి కృతజ్ఞత కలిగి దానిని తెలియజేయుట మంచిది, మీ సామర్థ్యము కొలది కష్టపడిపనిచేయుదుమని సంఘమునకు హామీ ఇచ్చుట మంచిది.

**మీసానుకూలతను తెలుపుడి :** సంఘస్థులు ఏ సమయమందైనా మిమ్మును కలసికొన

వచ్చుననే సానుకూలతను వారికి తెలియ జేయాలి. వారికేమైనా సమస్యలుంటే సానుకూలంగా వినాలి. ఎవరిదైనా లేక అందరి కోరికలు తీర్చగలననే హామీ గాని అట్టి అభిప్రాయముగాని వారికి ఎన్నడు ఇయ్యకూడదు. గాని వారందరు మీ యొద్దకు ఎన్నడైనా రావచ్చనే హామీ ఇయ్యాలి. సంఘములో ఎల్లవేళలా శాంతి సమాధానములుండునట్లు పాటుపడె దమని వారికి హామీ ఇయ్యాలి.

**కష్టపడి శ్రమ పడుదనని హామీ ఇయ్యాలి :** సంఘ పెద్దగా యుండినందున మీకు జీతము భత్యము యేమీరాదు. మీరు కేవలము మంచి జరిగించుటకే ఎల్లవేళల ప్రయత్నించాలి. చాలసార్లు మీరు చాల రాత్రి వరకు పనిచేయవలసి వస్తాది. ఎవరైనా విమర్షిస్తే సహృదయంతో దానిని అంగీకరించాలి, మీకు అనేక సందర్భాల్లో బాధకలుగ వచ్చు మీ ముందు కొన్ని చీకటి ఘడియలు ఉండవచ్చును. వాటన్నిటి లోను మీ గమ్యమునే ముందుంచు కొనాలి. మీరు దేవునియందు, మిమ్మును ఎంచుకొనిన వారియందు, ఒండొరుల యందు విశ్వాసము కలిగి యుండాలి.

మీరు అస్థిరులైతే యితరులకు మంచి మాదిరి నెలకొల్పలేరు. దేవుని మందిరములో నమ్మకముగా యున్న పెద్దలవలె మీరు మాటలోను, క్రియలోను, బోధలోను, అచరణలోను, మీరుచేయు అన్నిటిలోను మాదిరిగా యుండాలి. మీసేవలో అలసిపోరాదు. ఇతరులలో ధైర్యము, విశ్వాసము, బలము పెంపారు లాగున మీరు ఎల్లవేళలా ప్రయత్నించాలి. మీరు తేలికగా నిరుత్సాపడి, ధైర్యము కోల్పోవు వారైతే మంచి కాపరులు కాలేరు, నాయకుడు నడిపించాలి, నా వల్లకాదని చేతులెత్తేయ కూడదు.

**లేఖనములు మాత్రమే మీ అధికారము :** అన్ని విషయములలోను మీరు దేవుని వాక్యానికి కట్టుబడి యుండాలి. అట్లుండాలంటే మీరు దేవుని వాక్యము నెరిగిన వారైయుండాలి. ప్రతి సత్కార్యము చేయుటకు దేవుని వాక్యముపైనే ఆధార పడి యుండాలి. లేఖనముల అధికారము ను గూర్చి, ఆత్మావేశమును గూర్చి మీరెన్నడు శంకించకూడదు. రాత్రింబ వళ్లు మీరు వాటిని ధ్యానించాలి. మీ పని చేయుటకు కేవలం దేవుని వాక్యము పైనే మీరు ఆధారపడి యుందురని తెలిసికొనుటకు సహోదరులకు హక్కు వున్నది.

**క్రీస్తు సంఘము దైవిక సంస్థయై యున్నది:** క్రీస్తు సంఘమును గూర్చి మీ మనసులలో ఎవ్విధమైన సంశయము వుండరాదు. అసత్యములో యున్న వారిని గూర్చి మీరు విచారించవచ్చును గాని ప్రభువు

సంఘమును కాయుట మీ ముఖ్యమైన పని సువార్తను బోధించి అసత్యములో యున్నవారిని సత్యములోనికి మార్చే ఏకైక దైవిక సంస్థ క్రీస్తు యొక్క సంఘము, మానవ కల్పిత సంఘములు, డినామినేషన్లు లోకసంబంధ సంస్థలు క్రీస్తు సంఘ స్థానములో యుండనేరవు. క్రీస్తు సంఘము లాంటిది మరొకటి లేదు. దానికదే సాటి, అది దైవికం. మిగతా సంస్థలన్నీ మానవ కల్పితములే. మీరు క్రీస్తు సంఘము ఒక్కటే దైవ కల్పితమని నమ్ముచున్నట్లును, దానికి సాటియైనది యేదీ లేనట్లును మీరు నమ్ముచున్నట్లు సహోదరులు మీయందు నమ్మిక యుండాలి.

**శాంతి సమాధానములు :** ఎల్లవేళలా మీరు శాంతి సమాధానము లుండేలాగున ప్రయత్నించాలి, సభ్యులు వారిలో సణుగులాడుచు, పనికి మాలిన విషయాలపై భేదాభిప్రాయములు కలిగియుండుచు, సంఘములో అధికా రము కొరకై ప్రాకులాడుచున్నప్పుడు అట్టివారితో మృదువుగా, ఖచ్చితముగా వ్యవహరించాలి. సంఘములో యున్న ప్రతి వారు ప్రభువు పనిలో నిమగ్నులైనట్లు యుంటే వారు సంతోషముగా యుందురు, కలిసి పని చేయుచు సంఘాభివృద్ధి కొరకు సహాయపడుదురు.

**పెద్దలను ప్రతిష్టించే కార్యక్రమము :**

పెద్దలుగా కొందరు ఎంపిక చేయబడిన తరువాత ఒకటి రెండువారాల్లో వారిని పెద్దలుగా నియమించు తేదీని నిర్ణయించి ఆదినమందు సంఘమంతా సమావేశమైన తరువాత ఆ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక సువార్తికుడు గ్రంథము నుండి ఒక మంచి పాఠము నందించాలి, క్రొత్తగా పెద్దలుగా నియమింపబడినవారు దానిని తమకనుగ్రహించిన ఘనతగా ఎంచాలి. వారు తమ బాధ్యతల నెరిగిన వారై యుండాలి. స్థానిక సంఘము కూడ వారికి లోబడునట్లుండాలి.

పెద్దగా నియమింపబడిన వారిని ఒక్కొక్కరిగా పేర్లు పిలిచి ప్రతి పెద్దను సన్మానించాలి. ప్రతిష్టించాలి. ఈ లోగ అందరినీ ప్రతిష్టించిన తరువాత క్రొత్తగా ఏర్పరచబడిన పెద్దలు నిలిచి స్థానిక సంఘమునకు తమ అభినందనలు తెలియజేయాలి, క్రొత్తగా ఏర్పడిన పెద్దల విషయమై ప్రత్యేక ప్రార్ధన చేయాలి. అందరు స్థానిక సంఘపెద్దలకు లోబడియుందుమని కలిసి పనిచేయుదుమని పెద్దలకు తెలియజేసి, అందరు సంఘాభివృద్ధి కొరకు కృషిచేయుదుమని పెద్దలకు తెలియ జేయాలి. ఇదంతయు దేవుని మహి మార్థమై, సంఘక్షేమార్థమై మర్యాదగాను, క్రమముగాను జరిగించాలి.

ఆరంభము మంచిదయితే స్థానిక

సంఘములో శాంతి సమాధానము లుంటాయి. గాని ఆది నుండే పెద్దల యెడల సంశయములున్నట్లయితే వారి పనికి గొప్ప ఆటంకము కలుగును. పెద్దలుగా పని చేయువారు స్థానిక సంఘము కొరకు రేయింబవళ్ళు సంఘము కృషిచేయాలి.

పెద్దలను ఎంపిక చేయుటలో సహోదరులు సమయం, దీర్ఘ ఆలోచన, ప్రార్థన చేసినట్లయితే సంఘములో శాంతి, సమాధానము, ఐక్యత నెలకొనియుండును. దేవుడు వారిపనిని ఆశీర్వదించును, ఫలభరితము చేయును. అయితే దేవుడు చెప్పినట్లుగాక, తమ్మునుతామే సంతోష పరచుకొనుటకు సహోదరులు తమకిష్టమైనట్లు చేస్తే వారి పని ఫలించదు. దేవుని నామము ఘనపరచుబడునట్లును, సంఘము బలపడునట్లును, దేవుని మహిమ భూమిమీదను, సముద్ర జలములమీదను వ్యాపించునట్లును మనం ఎల్లవేళలా వాక్యప్రకారమే పనిచేయవలెను.

-L.R. విల్సన్

## ధనము యొక్క దీవెనలు

## (The Blessings of Money)

ధనమును గూర్చి, ఐశ్వర్యమును గూర్చి బైబిలు తరుచు హెచ్చరించుచున్నది. వెర్రివాడైన ధనవంతుడు (లూకా 12:15-21), ధనవంతుడు లాజరు (లూకా 16:19-26), మరియు ధనవంతుడైన యువకుడు (మత్తయి 18:22-26) మొదలగుసందర్భాలను మనం బాగుగా ఎరిగియేయున్నాము. ధనవంతులను గూర్చి చెప్పబడిన ఒంటె సూది బెజ్జము యొక్క సందర్భాన్ని మనం బాగుగా ఎరుగుదుము (మత్తయి 19:24). మరల యాకోబు 1:9-11లో ధనవంతులను గూర్చి చెప్పబడిన గడ్డి పువ్వు సందర్భమును కూడ మనం ఎరుగుదుము. అయితే ధనాన్ని గూర్చిన మిగతా బోధను మనం ఎరుగుదుమా?

బైబిలు అంతటిలో ధనముకాదు గాని ధనమునందు నమ్మిక యుంచుట ఖండించబడినది. యిది మనం ఎరుగుదుమా? (మార్కు 10:24; కీర్త 39:6-7). సమస్త కీడులకు మూలమైనది ధనాశే గాని ధనముకాదని గ్రహించు చున్నామా? (1తిమో 6:9-10). ధనము దీవెనయని దేవుడు చెప్పిన దానిని మనం గ్రహించామా? మరియు ధనధాన్య సమృద్ధి దేవుడిచ్చిన ఆశీర్వాదమని బైబిలు చెప్పుచున్నదని గ్రహించుచున్నామా? (ప్రసంగి 5:18- 19). లేఖనములలో

చెప్పబడిన అనేక ధనవంతులైన పురుషులు, స్త్రీలును గూర్చి వారి భక్తి విశ్వాసములను గూర్చి ఎన్నడైన స్టడీ చేసావా?

దిగువ చూపించబడిన ధనవంతులను గమనించుము, వారు దేవుని యందు గొప్ప నమ్మిక గలవారు, అయిన ను గొప్ప ఐశ్వర్యవంతులు. మనం ధన భాగ్యములతో దీవించబడిన వారమైతే ఆ దీవెనలను ఎట్లుపయోగించుచున్నాము?

**అబ్రాహాము :**

యితడు గొప్ప విశ్వాస వీరుల పట్టికలో యున్నవాడు (హెబ్రీ 11:8-10, 17-19). అతడు దేవుని స్నేహితుడని పిలువబడ్డాడు (యెషయా 41:8, యాకోబు 2:23). అయినను అతడు "వెండి, బంగారము పశువులు కలిగి బహుధనవంతుడై యుండెను" (ఆదికా 13:2). అబ్రాహాము "గొప్పవాడయెను, అతనికి గొర్రెలను గొడ్లను వెండి బంగారములను దాస దాసీ జనమును ఒంటెలను గాడిదలను" దేవుడు దయ చేసెను (ఆదికా 24:35).

**ఇస్సాకు:**

"అనేకులు వచ్చి అబ్రాహాముతో కూడను, ఇస్సాకుతో కూడను యాకోబుతోను కూడను పరలోకమందు కూర్చుందురని" యేసు చెప్పెను (మత్త 8:11). ఆదికాండము 26:12-14లో గొప్ప కరవు వచ్చినను "ఇస్సాకు ఆదేశమందు న్నవాడై విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలము పొందెను. యెహోవా అతని ఆశీర్వదించెను గనుక ఆమనుష్యుడు గొప్ప వాడాయెను. అతడు మిక్కిలి గొప్ప వాడగు వరకు క్రమక్రమముగా అభివృద్ధిపొందుచు వచ్చెను. అతనికి గొర్రెల ఆస్తియు గొప్ప ఆస్తియు దాసులు గొప్ప సమూహమును కలిగి యుండెను" అనిచదువగలము .

**యాకోబు :**

అదేరీతిగా యాకోబుకూడ పశువులు, గాడిదలు మందలు దాసదాసీ జనము కలిగి యుండినట్లు ఆదికాండము 32:5లో చెప్పబడి యున్నది.

**బోయజు :**

ఇతడు యేసుక్రీస్తు యొక్క ఒక మూలపురుషుడు. రూతు యొక్క భర్త అయినను అతడు గొప్ప ఔదార్యము గల మనుష్యుడు "అతడు చాల ఆస్తిపరుడని" బైబిలు చెప్పుచున్నది (రూతు 2:1).

**యెహోషాపాతు :**

ఇతడు యూదా రాజు. అతడు యెహోవా నియమించిన మార్గములో నడచినవాడు, నమ్మకమైన దేవుని దాసుడు "అతనికి ఐశ్వర్యమును ఘనతయు మెండుగా కలిగెను" (2 దినవృ 17:3-5).

**హిజ్కియా :**

ఇతడు యూదా యొక్క మరియొక రాజు, "అతడు తన

పితరుడగు దావీదు చర్యయంతటి ప్రకారము యెహోవా దృష్టికి యదార్థముగా ప్రవర్తించెను (2 దినవృ 29 :2). అతడు గొప్ప ఐశ్వర్యవంతుడు. అతని గూర్చి బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "హిజ్కియాకు అతి విస్తారమైన ఐశ్వర్యము ను ఘనతయు కలిగెను. అతడు వెండి బంగారములను, రత్నములను సుగంధ ద్రవ్యములను నానావిధము లగు శ్రేష్టమైన ఉపకరణ ములను సంపాదించి వాటికి బొక్కసము లను కట్టించెను. ధాన్యమును ద్రాక్షారసము ను తైలమును ఉంచుటకు కొట్లను, పలువిధముల పశువులకు శాలలను మందలకు దొడ్లను కట్టించెను. మరియు దేవుడు అతనికి విస్తారమైన కలిమి దయ చేసినందున పట్టణములను విస్తార మైన గొర్రెల మందలను పసులమందలను అతడు సంపాదించెను" (2 దినవృ 32: 27- 29).

**యోబు :**

మనము యోబు యొక్క ఓర్పును, సహనమును యదార్థతను బాగుగా ఎరిగి యున్నాము, "అతనికి ఏడు వేలగొర్రెలును మూడు వేల ఒంటెలును, ఐదు వందల జతల ఎడ్లును ఐదువందల ఆడు గాడి దలును కలిగి బహుమంది పని వారును అతనికి ఆస్తిగా యుండెను. గనుక తూర్పు దిక్కు జనులందరిలో అతడే గొప్పవాడుగా ఉండెను" (యోబు 1:3). విశ్వాస పరీక్షలో యోబు నిలిచిన తరువాత, అతడు "తన స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేసినప్పుడు యెహోవా అతని క్షేమ స్థితిని మరల అతనికి దయ చేసెను. మరియు యోబు నకు పూర్వము కలిగిన దానికంటె రెండంతలు అధికముగా యెహోవా అతనికి దయచేసెను. మరియు అతని సహోదరులందరును అతని అక్క చెల్లెండ్రందరును అంతకు ముందు అతనికి పరిచయులైన వారును వచ్చి అతనితో కూడ అతని యింట అన్నపానములు పుచ్చుకొని యెహోవా అతని మీదికి రప్పించిన సమస్తబాధను గూర్చియెంత వేసి దు:ఖము పొందితివని అతని కొరకు దు:ఖించుచు అతని ఓదార్చిరి. ఇదియు గాక ఒక్కొక్కడు ఒక వరహాను, ఒక్కొక్కడు బంగారు ఉంగరమును అతనికి తెచ్చి యిచ్చెను. యెహోవా యోబును మొదట ఆశీర్వదించిన దానికంటె మరి అధికము గా ఆశీర్వదించెను. అతనికి పదునాలుగు వేల గొర్రెలును ఆరువేల ఒంటెలును, వెయ్యిజతల యెడ్లును, వెయ్యి ఆడు గాడిదలును వుండెను" (యోబు 42: 10- 12).

**అరిమతయి యోసేపు :**

ఇతడు చాల ఆసక్తిపరుడు. అతడు యేసుక్రీస్తు యొక్క రహస్యశిష్యుడు (మత్తయి 27-57; యోహాను 19:38). సమాజ మందిరపు సభ్యుడు (మార్కు 15:43), యేసును పట్టు కొనుటకు అసమ్మతి వ్యక్త పరచినవాడు (లూకా

23:51), రాజ్యము కొరకు ఎదురు చూచుచున్నవాడు (మార్కు 15:43; లూకా 23:51), అతడు సజ్జనుడు, నీతిమంతుడు (లూకా 23:50), యేసును సమాధి చేసిన తోట యజమానుడు (మత్త 27:60; లూకా23:53; యోహాను 19:41). అతడు ధనవంతుడు (మత్తయి 27:57).

**జక్కయ్య :**

అతడు యేసును చూడగోరి మేడి చెట్టు ఎక్కిన పొట్టి వాడు మాత్రమే కాదు గాని అతడు మిగుల ఆస్థిపరుడు. యేసు వలన రక్షణ పొందిన వాడు (లూకా 19:1-10). అతడు పన్ను వసూలు చేసే ధనవంతుడు మాత్రమే కాదుగాని, దేవుని రాజ్యములో సభ్యుడుగా చేర్చబడుటకు అర్హతగల వానిగా యేసు అతని ఎంచెను.

**తబిత :**

ఈమె కూడ ఆస్థిపరురాలి గానే మనకు లేఖనములలో కనబడుచున్నది. ఏలయనగా "ఆమెసత్ క్రియలను ధర్మ కార్యములను బహుగా చేసియుండెను" (అపొ.కా. 9:36). ఆమెకష్టజీవి, తన చేతులతో అంగీలను, వస్త్రములను కుట్టు చుండెను. ఆమె చనిపోగా పేతురు ఆమెను బ్రదికించెను. ఆమె పలుకుబడి కలిగిన స్త్రీ, ఏలయనగా ఆమె తిరిగి బ్రదికినదని "యొప్పేయందంతట తెలిసి నప్పుడు అనేకులు ప్రభువునందు విశ్వాముంచిరి" (అపొ. కా. 9:42).

**లూదియ :**

ఫిలిప్పయి పట్టణములో పౌలు సువార్త బోధింపగా లూదియ బాప్తిస్మము పొందెను (అపొ.కా. 16:15). ఆమె ఊదా రంగు పొడిని అమ్మేది. ఆరోజులలో ఊదా రంగు రాజరికమును, ఐశ్వర్యమును సూచించేది గనుక ఆమె ధన వంతురాలని మనము చెప్పుకోవచ్చును. ఆమె క్రైస్తవు రాలవగానే తనకు రక్షణ సువార్తనం దించిన వారికి ఆతిధ్యమిచ్చి తన ధనమును ప్రభువు కొరకు వినియోగిం చుటకు మొదలిడెను (అపొ.కా. 16:12-15).

ఇట్టి విధముగా ధనవంతులై యుండియు దేవుని యెడల నమ్మకముగా యున్న వ్యక్తులను గూర్చి పదేపదే లేఖనములు మనకు తెలియ జేయుచు న్నవి. బైబిలు సూత్రములను బట్టి ఒకడు ఆర్ధికముగా సంపన్నుడై యుండియు తండ్రి యైన దేవునితో సత్సంబంధమును కలిగి యుండుట సాధ్యమే. మనము ధనము సంపాందిచుకొనుటకు అవకాశము కల్పించినవాడు ఆయనే (ద్వితీ 8:18; యాకోబు 1:17). మన ఆత్మ వర్ధిల్లు ప్రకారము మనము అన్ని విషయము లలోను వర్ధిల్లాలని ఆయన కోరుచున్నారు (3 యోహా :2). తమ అవుసరములను ఇతరుల అవుసరములను తీర్చునట్టి దేవుని నమ్మకముగా యున్న క్రైస్తవులు సేవించుచు న్నారు. లేమిలోయున్న వారికి

క్రైస్తవులు సంతోషముతో సహాయము చేయుదురు. ధారాళముగా, హృదయ పూర్వకముగా ఇచ్చుట వలన దేవుడు మహిమ పరచబడు ను. దాని వలన యితరుల అవుసరములు తీర్చబడును, సువార్త ప్రకటింపబడును, యితరులను క్రీస్తు ప్రేమకు పరిచయము చేయును. తన ప్రజలు బీదవారై యుండాలని దేవుడు కాంక్షించరు; వారు సంపన్నులైతే ఆయనకు దేవునికి నమ్మకముగా యుండాలని ఆయన కోరుకొనును. నీవు సంపన్నుడ వైతే నీధనాన్ని ఎట్లు వినియోగించుచున్నావో అది లెక్కలోనికి వచ్చును.

ధనవంతుల యెడలను వారు సాధించిన విషయముల యెడలను మనం సంశయములు వెళ్ల బుచ్చుట కంటే, పరలోకమందు ధనము కూర్చు కొనుటకు ప్రతివాడు ప్రయత్నించ వలెను. అట్లు చేస్తే ఉదార స్వభావము కలిగి దాన ధర్మ క్రియలను చేయు వారిని అనేకులను మనము చూడగలము.

ఈలోకమందు ధనవంతులైన వారు అనేకులు దేవుని పనికి ధారాళముగా యిచ్చి, యితరులకు తమ వంతు సహాయపడుచు గొప్ప ఆనందమును ఇప్పటికే అనుభవించు చున్నారు. ఆలాగే క్రీస్తు యొక్క జ్ఞాన మందు ధనవంతు లైనవారు, ఆయన యిచ్చిన వరమును, అనుగ్ర హించిన భద్రతను, ఆశీర్వాదములను పొందు చు యితరులను క్రీస్తులోనికి తప్పక నడపాలి. దేవునిలో ధనవంతు లుగా యుండాలంటే స్త్రీ పురుషులను క్రీస్తులోనికి నడపాలి.

– జిమ్ పామర్

## పందుల పాక పాఠములు
## (Hog Pen Lessons)

లూకా సువార్త 15వ అధ్యాయము లో యేసు మారుమనస్సును గూర్చి 3 గొప్ప పాఠములు బోధించారు. మొదటిది. తప్పిపోయిన గొర్రెను గూర్చినది. గొర్రెల కాపరి 99 గొర్రెలను విడిచి తప్పి పోయిన ఒక్క గొర్రెను వెదుకుటకు వెళ్లాడు. తప్పిపోయిన ఒక్క ఆత్మ విషయమై దేవుని యొక్క చింతను గూర్చి ఆ ఉపమానము మనకు బోధించుచున్నది. మారు మనస్సు పొందిన ఒక్క పాపి విషయమై పరలోక మందు గొప్ప సంతోషము కలుగును.

రెండవది పదినాణెములు కలిగిన స్త్రీ, వాటిలో ఒక దానిని పోగొట్టుకొనిన సందర్భము. తొమ్మిది నాణెములు కలిగి యున్నా పది నాణెములున్నప్పుడు కలిగినంత సంతోషము ఆమెకు లేదు. పదియవ నాణెము దొరికినప్పుడు ఆమె

సంతోషము అమితమైనది. ఒక్క ఆత్మ ప్రశస్తమైనది. ఆయాత్మ తిరిగి దేవుని యొద్దకు వచ్చినప్పుడు ప్రభువు సంతోషించును. వ్యక్తిగత అజాగ్రత్త వలన గొర్రె తప్పి పోయెను. మరొకరి అజాగ్రత్త వలన పదియవ నాణెము పడిపోయెను.

మూడవది అయితే తన సేచ్ఛా పూర్వకముగా తప్పిపోయిన యౌవనస్థుని గూర్చినది. అతడు ధనవంతుడైన తండ్రి యొక్క చిన్న కుమారుడు. వాడుకోరగానే తండ్రి అతని ఆస్థిలో సగము వానికిచ్చి వేసాడు. యిది తప్పిపోయిన కుమారుని గాథయని మనకు తెలుసు. ఆ చిన్నవాడు ఆస్థిని సమకూర్చుకొని. దూరదేశమునకు పోయి యిష్టము వచ్చినట్లు జల్సాగా జీవించాడు. చివరకు అంతా ఖర్చయి పోగా, అతడు ఎందుకు పనికి మాలిన వాడయ్యాడు. అయితే బుద్ధివచ్చినప్పుడు అతడు తన తండ్రియొద్దకు తిరిగి వచ్చాడు. మారుమనస్సు పొంది తండ్రి చిత్తానికిలోబడ్డాడు. క్షమించ బడ్డాడు తండ్రి సంతోషంలో పాలివాడయ్యాడు.

మారుమనస్సు పొంది తిరిగి వచ్చిన చిన్న వాని విషయంలో తండ్రి చూపిన ఆదరణను గూర్చి పెద్దవాడు అభ్యంతరం వ్యక్తపర్చాడు గాని అతని తమ్ముడు చనిపోయి మరల బ్రదికెనని తప్పిపోయి దొరికెనని దయగల తండ్రి అన్నకు జ్ఞాపకం చేసాడు. మానవుడు మారుమనస్సు పొంది విధేయత చూపాలి.

ఈ యౌవనస్థుడు పందుల ను మేపుచు, అధోగతి పాలై కొన్ని గొప్ప పాఠములు నేర్చుకొన్నాడు.

1. స్వేచ్ఛతో కూడ బాధ్యతలుంటాయని అతడు నేర్చుకొన్నాడు. తన స్వేచ్ఛను గూర్చిన తొందరపాటు అభిప్రాయముల వలన అతడు నిర్లక్ష్యాన్ని బుద్ధిహీనతను ప్రదర్శించి కొన్ని నిర్ణయాలు గైకొన్నాడు.

2. జల్సా ఖర్చుల యొక్క నిష్ప్రయోజనాన్ని గూర్చి అతడు నేర్చుకొన్నాడు. ఆస్థిని పాడుచేయు వాడు కీడు నొందును మాట ఇతని విషయంలో నిజం.

3. నీచ బ్రతుకు యొక్క ఉన్నత మూల్యాన్ని గమనించాడు. నేరము, అవినీతి, అక్రమము, జల్సా మొదలైనవి ఒకని ధనాన్ని. మనస్సును అధోగతిపాలు చేయును.

4. జీవితం కష్టతరం అని అతడు నేర్చుకొన్నాడు. మానవులు ఎల్లవేళలా జల్సాగా యుండాలనేది జీవిత ఉద్దేశ్యం కాదు. కావలసినప్పుడు మనం కష్టపడి పని చేయకపోతే, మనకిష్టము లేనప్పుడు కష్టపడి పని చేయాల్సి వస్తాది, కష్టేఫలి!

5. సుఖ సంతోషాలను కోరుకొనడం అపరి పక్వతకు సూచనయని అతడు నేర్చు కొన్నాడు. నేను పిల్లవానివలె యున్నప్పుడు పిల్లవాని వలె మాట్లాడితిని, పిల్ల వానివలె తలంచితిని, పిల్లవాని వలెయోచించితిని. ఇప్పుడు

పెద్దవాడనై పిల్లవాని చేష్టలు మానివేసితిని అని అపొ.పౌలు చెప్పాడు (1 కొరింథి 13:11). ఈ యౌవనస్థునికి సుఖ సంతోషాలు నేర్పని పాఠములెన్నో అతనికి నేర్పాయి.

6. తల్లిదండ్రులు ప్రేమించునంతగా ఈ లోకంలో ఎవరు ప్రేమించరు అని అతడు నేర్చుకొన్నాడు. చేతినిండా డబ్బున్నప్పుడు చేరిన అతని ఆప్తమిత్రులు, డబ్బంతా ఖర్చయి పోగానే మాయమై పోయారు.

7. దుర్భరస్థితిలో మానవులు ఏమైనా చేసేస్తారని అతడు తెలిసికొన్నాడు. అతడు ఆకలితో అలమటించుచు పందులు తినుపొట్టుతో సయితము కడుపు నింపుకొన గోరాడు. పాపపు జీవితం మానవులను మృగ మాత్రులుగా చేసి నీచకార్యములకు ప్రోత్సహించును.

8. దేవుని యొద్దకు తిరిగి చేరుకొనుటకు కృత నిశ్చయత వినయ విధేయత అవసరమని అతడు నేర్చుకొన్నడు. బలహీనుడై దృఢ సంకల్పములేని వాడు దేవుని యొద్దకు తిరిగి చేరుకొనుటకు సాహసించలేడు.

దేవుని సన్నిధానమునకు తిరిగి చేరుకొనునప్పుడు వేషధారులను లెక్క చేయరాదని అతడు నేర్చుకొన్నాడు. కృంగి కృషించి పోయిన ఈ చిన్న కుమారుడు తిరిగి రాగా అతని అన్న యేమీ సహాయ పడలేదు. తండ్రి యొక్క ప్రేమ, తిరిగి రావాలనే అతని దృఢ సంకల్పము వలన తప్పిపోయిన కుమారుడు తన దీర్ఘ తిరుగు ప్రయాణం చేయగలిగాడు. యింటి నుండి, సమాధానము నుండి అతనిని యేదీ దూరము చేయకూడదని పందులు పాకలోనే అతడు నిశ్చయించుకొన్నాడు.

అతని తండ్రి నిజముగా ప్రేమించుచున్నాడని, సంతోషంతో అతనిని తిరిగి చేర్చుకొంటాడని అతనికి మరొక తరుణం యిస్తాడని అతడు నేర్చుకొన్నాడు క్రీస్తు యొక్క సువార్తలోని వర్తమానం యిది. పందుల పాకలో మన జీవితాలను పాడు చేసుకోడానికి నీవు, నేను దేవునికి ప్రశస్తమైనవారము. మనలను దేవుని యొద్దకు, పరలోకానికి చేర్చడానికి మారు మనస్సు విధేయత అనే ద్వారాలు ఎప్పుడు తెరువబడేయున్నాయి.

క్లిష్ట పరిస్థితులలో కూడ మనం అనేక పాఠములు నేర్చుకొనవచ్చు. తప్పిపోయిన కుమారునివలె మనం తగ్గించుకోవాలి.

– ఆవెన్ కాస్ గ్రోవ్

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధవారము సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు**
**శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

## సంక్షిప్త వార్తలు

2011 జూలై 8వ తేదీ శుక్రవారం రిక్కీగూటం గారు, జస్టిన్ గూటం గారు, సుదీప గూటం గారు తమ మూడునెలల అమెరికా పర్యటన ముగించుకొని కాకినాడకు క్షేమముగా చేరుకొనిరి. రాజమండ్రి విమానాశ్రయములో వారి బంధువులు, మిత్రులు ఘనస్వాగతము నిచ్చిరి.

జూలై 13వ తేదీ శుక్రవారం అమెరికాలోని ఓక్లహోమా యూనివర్సిటి నుండి 5గురు యువతీ యువకులు రిక్కీ గారితో మూడువారములపాటు పనిచేయుటకు కాకినాడ చేరుకొనిరి. జూలై 15వ తేదీ శుక్రవారం కాకినాడ సత్యవాణి-క్రీస్తుసంఘం ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. పలుపట్టణప్రాంతముల నుండి, జిల్లాల నుండి అనేకమంది సువార్తికులు హాజరై రిక్కీగారి విదేశీయాత్రను గూర్చి అభినందనందించిరి. పలువురు వాక్యపరిచర్యచేసిరి. అమెరికా యువక బృందము చక్కటి ఆత్మీయపాటలను ఇంగ్లీషులోపాడి అందరిని ఆహ్లాదపరిచిరి. వచ్చిన వారందరికి మంచి భోజనము ఏర్పాటు చేయబడెను.

జూలై 19వ తేదీ మంగళవారం ముమ్మిడివరం మండలం సేరిలంకలో జాషూవాగూటం గారి నాయకత్వమున నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును రోయస్‌ఫ్రెడరక్ గారు దేవుని సేవార్థమై ప్రతిష్టించిరి. రిక్కీ గూటం గారు తదితర సువార్తికులు ఆకార్యక్రమమునకు హాజరైరి. రిక్కీ గారితో యున్న అమెరికా యువక బృందముకూడా ఆ కార్యక్రమమునకు హాజరైరి.

జులై 20వ తేదీ బుధవారం ముమ్మిడివరం మండలం గున్నేపల్లిలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును జాషువా గారు, రోయస్‌గారు కలిసి ప్రభువు సేవార్థమై ప్రతిష్టించిరి. గున్నేపల్లిలో ముఖ్యముగా హిందువుల మధ్య సోదరులు టి. యోసేపు రాజుగారు పలు సంవత్సరాలుగా నమ్మకమైన సువార్త పనిచేయుచున్నారు. యోసేపు రాజుగారు, ఆయన కుటుంబము అనేక వ్యయప్రయాసలకోర్చి, నూతన ఆలయమును జాషువా గారి యొక్కయు, రిక్కీగారి యొక్కయు సహాయ సహకారములతో చక్కగా నిర్మించిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి విందు ఏర్పాటుచేసిరి.

గమనిక ::

సత్యవాణి కార్యక్రమములను
ప్రతి బుధవారము సాయంత్రం 6:30 గంటలకు
రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు
ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00
గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2009-11

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 00